కొండారెడ్డిపల్లికి కొత్త శోభ



ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

వంగూరు, కల్వకుర్తి, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి హోదాలో ఎనుముల రేవంత్‌రెడ్డి తొలిసారి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి దసరా పండగ రోజు రావటం కొత్త శోభ నెలకొంది. శనివారం మధ్యాహ్నం ప్రత్యేక హెలిప్యాడ్‌లో చేరుకొన్నారు. గజమాలలతో గ్రామస్థులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక వాహనంలో రోడ్డు వెంట పూలవర్షం కురిపిస్తూ కోలాటాలు, బతుకమ్మలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. రాష్ట్ర ముఖ్యమంత్రి అయినా గ్రామస్థులు, బంధువులను మర్చిపోకుండా పేరుపేరునా పలుకరించడం ప్రత్యేకతను సంతరించుకుంది. సాయంత్రం 6.30 గంటలకు ఇంట్లో నుంచి సీఎం పంచెకట్టుతో బయలుదేరి ఆయన నిర్మించిన కోటమైసమ్మ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. కొండారెడ్డిపల్లికి ముఖ్యమంత్రి వస్తున్నారని గ్రామానికి చెందిన ఆడబిడ్డలు, అల్లుళ్లు, బంధువులు రాకతో ఊరంతా జనసందోహంతో కళకళలాడింది. ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ, మాజీ జడ్పీటీసీసభ్యుడు కేవీఎన్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు. అనంతరం గ్రామ యువకులతో స్వీయచిత్రాలు దిగారు.

ఆరు గంటలపాటు సీఎం పర్యటన

ఆరుగంటల పాటు కొండారెడ్డిపల్లిలో ఉండి బంధువులు, గ్రామస్థులు, అభిమానులకు సమయమిచ్చారు. రాత్రి 8.15 గంటలకు ప్రత్యేక వాహనాల్లో కొడంగల్‌కు వెళ్లారు.

రూ. 50 కోట్లతో అభివృద్ధి పనులు..:

గ్రామానికి చెందిన వ్యక్తి ఎనుముల రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్య మంత్రి కావటం మా అదృష్టమంటు, కొండారెడ్డిపల్లి ప్రజలు ప్రతి పనిలో బాగస్వాములైయ్యారు. గ్రామంలోని ప్రతి ఇంటిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే కొండారెడ్డిపల్లికి నాలుగు వరుసల రహదారి ఏర్పాటుకు నిధులు మంజూరు చేయటం, నిత్యం జిల్లా అధికారులు గ్రామానికి రాకతో ప్రజల్లో ఆనందాలు తొంగి చూశాయి. రూ.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో గ్రామ రూపురేఖలు మారిపోయాయి.



జమ్మి పూజకు గ్రామస్థులతో తరలివెళ్తున్న రేవంత్‌రెడ్డి, పక్కన మల్లు రవి, డా.వంశీకృష్ణ

నేడు ప్రజావాణి రద్దు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : వనపర్తి కలెక్టరేట్ సమావేశ మందిరంలో దిశా సమావేశం నిర్వహిస్తున్నందున సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ఆదర్శ్‌సురభి తెలిపారు. దిశా సమావేశంలో అధికారులు పాల్గొంటారని, దరఖాస్తులిచ్చేందుకు ఎవరూ అర్జీదారులు రావద్దని సూచించారు.

గోపాల్‌పేటలో మొసలి సంచారం

గోపాల్‌పేట : గోపాల్‌పేట సమీపంలోని అమ్మ చెరువులో ఆదివారం ఉదయం కొందరు వ్యక్తులు మొసలి సంచారాన్ని గుర్తించారు. చెరువు మధ్యలో ఉన్న గడ్డపై మొసలి తిరుగుతుండటాన్ని వారు చూసి వీడియోతీసి వాట్సాప్‌లో పెట్టారు. విషయం తెలిసిన వెంటనే కొందరు చెరువువద్దకు వెళ్లి మొసలిని చూసేందుకు ప్రయత్నించారు. అది కనిపించక పోవడంతో ఎవరు కూడా చెరువులోకి దిగొద్దని, మేకలు, గొర్రెలను నీరు తాగించేందుకు చెరువులోకి తీసుకెళ్లొద్దని సూచించారు. సమీపంలో పెద్ద కాలువలు, వాగులు లేకపోవడంతో మొసలి గోపాల్‌పేట చెరువులోకి ఎలా వచ్చిందనే విషయంపై పలువురు చర్చించుకుంటున్నారు.

సమన్వయలోపం.. సమయాభావం



ఇందిరమ్మ కమిటీల ఏర్పాటులో జాప్యం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు బాధ్యత వహించే కమిటీల ఏర్పాటులో జాప్యమయ్యేలా పరిస్థితి కనిపిస్తోంది. దసరా పండగ నాటికి కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినా సమయాభావంతో పూర్తి చేయలేకపోయారు. వరుస సెలవుల వల్ల గ్రామ పంచాయతీలు, పురపాలికల్లోని వార్డు స్థాయిల్లో కమిటీల ఏర్పాటు కొలిక్కిరాని పరిస్థితి నెలకొంది. అర్హులైన పేదల ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆరు గ్యారంటీల్లో భాగంగా ఈ పథకం అమలుకు ప్రభుత్వం సంకల్పించింది. గ్రామ, పురపాలికల స్థాయిలో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ల నుంచి ఆదేశాలున్నా క్షేత్ర స్థాయిలో ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు యంత్రాంగం సమాయత్తం కావాల్సి ఉంది.

- గ్రామాల్లో పాలకవర్గాలు లేని క్రమంలో ప్రత్యేక అధికారి ఛైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా, స్వయం సహాయక సంఘాల నుంచి ఇద్దరు, స్థానికులు ముగ్గురు ఇందిరమ్మ కమిటీలో సభ్యులుగా ఉండాలని నిర్దేశించారు. ముగ్గురు స్థానికుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి స్థానం కల్పించనున్నారు. పురపాలికల్లో పాలకవర్గాలు కొనసాగుతున్న నేపథ్యంలో కౌన్సిలర్ ఛైర్మన్‌గా, వార్డు అధికారి కన్వీనర్‌గా, స్వయం సహాయక సంఘాల నుంచి ఇద్దరు, స్థానికులు ముగ్గురికి అవకాశం దక్కనుంది. ముగ్గురు స్థానికుల్లోనూ బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి చోటు కల్పించనున్నారు.

నేడు పూర్తిస్థాయిలో కార్యాచరణ

ఇప్పటికే మార్గదర్శకాలు జారీ అయ్యాయి. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే సమావేశంలో పూర్తి స్థాయిలో కార్యాచరణ ఖరారు కానుంది. అనంతరం కమిటీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టనున్నాం.

– శశిధర్, పుర కమిషనర్

ఆధిపత్యపోరు తప్పదా?

ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు కమిటీల్లో రాజకీయ ఆధిపత్య పోరు తలనొప్పి వ్యవహారంగా మారే అవకాశం లేకపోలేదు. గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం పూర్తయిన క్రమంలో ఆయా పంచాయతీల్లో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటులో అధికార పార్టీ నాయకులు తమ అనుచరులకు స్థానం కల్పించాలని ఇప్పటికే సన్నద్ధమయ్యారు. లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణ పనుల పర్యవేక్షణ, ఆర్థికసాయం చెల్లింపులో కీలకంగా వ్యవహరించే అవకాశం ఉంటుందని.. గ్రామ, వార్డు స్థాయిల్లో ద్వితీయ శ్రేణి నాయకులు తమ పేర్లను నాయకుల దృష్టికి తీసుకెళ్తున్నారు.

గ్రామ కార్యదర్శులపై ఒత్తిళ్లు!

జిల్లాలో మొత్తం 255 గ్రామ పంచాయతీలు, ఐదు పురపాలికల్లోని 80 వార్డుల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు కానున్నాయి. మొత్తంగా 445 కమిటీల్లో కన్వీనర్, ఛైర్మన్ కాకుండా 1,675 మంది పొదుపు సంఘాల సభ్యులు, స్థానికులకు అవకాశం ఏర్పడనుంది. స్వయం సహాయక పొదుపు సంఘాల సభ్యుల్లో అధికార పార్టీ నాయకుల కుటుంబ సభ్యులకే ఇందిరమ్మ ఇళ్ల కమిటీల్లో స్థానం కల్పించే విధంగా ఇప్పటికే గ్రామ కార్యదర్శులపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. సమన్వయలోపం, ఆధిపత్య పోరు మధ్య ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు యంత్రాంగం సోమవారం నుంచి కసరత్తు చేపట్టనుంది.

మండలాలు : 14	గ్రామపంచాయతీలు : 255	పురపాలికలు : 5	వార్డులు : 80

ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు

గద్వాల జిల్లాలో నిబంధనలు హుష్

ఈనాడు, మహబూబ్‌నగర్

మహారాష్ట్రలోని అక్కల్‌కోట నుంచి చెన్నై వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పనులు జోగులాంబ గద్వాల జిల్లాలో 77.5 కిలోమీటర్ల మేరకు సాగుతున్నాయి. ఈ పనుల కోసం కేంద్రం రూ.1,568 కోట్లు కేటాయించింది. పనుల్లో భాగంగా మొరం మట్టిని వాడాలి. ప్రస్తుతం వడ్డేపల్లి మండలంలో పనులు కొనసాగుతున్నాయి. జూలకల్ ప్రాంతంలో కొన్ని ఎకరాల్లోని వ్యవసాయ భూములను మొరం మట్టి పేరుతో ఇష్టారాజ్యంగా తవ్వేశారు. ఇందులో భాగంగా కొందరికి ఎకరాకు రూ.లక్షల్లో ముట్టజెప్పారు. ఈ గ్రామంలోనే ఉన్న ఓ గుట్టను చెరపట్టారు. ఆర్డీఎస్ కాలువ వెంట ఉన్న పలు భూములను జేసీబీ, పొక్లెయిన్లు, టిప్పర్లు పెట్టి 10 అడుగులకుపైగా గుంతలు తీస్తున్నారు. ఇటీవల పడిన వర్షాలతో ఈ ప్రాంతాల్లో కొత్త చెరువులు పుట్టుకొచ్చాయి.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది చెరువనుకున్నారా? అయితే భ్రమ పడినట్లే. అచ్చం చెరువును తలపిస్తున్న ఈ ప్రాంతం ఏడాది క్రితం వరకు సాగు భూమి. కొన్ని ఎకరాల్లో ఉన్న ఈ భూమి చెరువుగా ఎలా మారిందని అనుకుంటున్నారా. మొరం మట్టి తవ్వడంతో ఈ పరిస్థితి నెలకొంది. వడ్డేపల్లి మండలం జూలకల్‌లోని ఆర్డీఎస్ కాలువకు సమీపంలోని భూములను ఈ ప్రాంతంలో చేపడుతున్న భారత్‌మాల రహదారి కోసం తవ్వారు. ఇక్కడ పట్టా, సీలింగ్ భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరపడంతో ఎకరాలు ఎకరాలు చెరువులను తలిపిస్తున్నాయి. సుమారు 10 అడుగుల లోతు వరకు భూమిని తవ్వి మొరం తరలించారు.

- వడ్డేపల్లి గుట్టు మాయమవుతోంది. ఇక్కడ మాధవస్వామి ఆలయం ఉంది. ఇక్కడి నుంచి కొన్ని లక్షల టన్నుల్లో మొరం మట్టిని తరలించారు. ఇక్కడి గుట్టను ఇష్టారాజ్యంగా తవ్వడంపై యడం లేదు. బుడమర్సు, తనగలలోని గుట్టలను కూడా యథేచ్ఛగా తవ్వుతున్నారు. ఈ రెండు గ్రామాల్లోని ప్రధాన గుట్టలను ఖాళీ చేస్తున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది వడ్డేపల్లి గట్టు. దీనిపై మాధవ స్వామి ఆలయం కూడా ఉంది. ఒక్కప్పుడు 25 ఎకరాలకుపైగా ఈ గుట్ట విస్తరించి ఉండేది. జాతీయ రహదారి కోసమని అనుమతుల పేరుతో ఇష్టారాజ్యంగా తవ్వారు. ప్రస్తుతం 25 ఎకరాల గుట్ట పూర్తిగా మాయమయ్యే పరిస్థితి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరపడంతో జిల్లాలోనే ఎంతో గుర్తింపు ఉన్న ఈ గుట్ట ప్రస్తుతం మాయమయ్యే పరిస్థితి వచ్చింది.

కిమ్మనని యంత్రాంగం : నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నా నాయకులు, అధికార యంత్రాంగం నోరెత్తడం లేదు. నియోజకవర్గంలో కీలకంగా ఉన్న కొందరు వ్యక్తులకు చేయితడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జరిమానాలు విధించామని భూగర్భ గనులశాఖ అధికారులు పైకి చెబుతున్నా అవన్నీ ప్రకటనలకు, కాగితాలకే పరిమితం. సాధారణంగా టన్ను మొరం మట్టికి రూ.35, రాళ్లకు రూ.80 వరకు సినరేజీ ఛార్జీలు చెల్లించాలి. గతంలో గట్టు, కేటీదొడ్డి మండలాల్లో తవ్వకాలు జరిగినప్పుడు విమర్శలు హోరెత్తడంతో సుమారు రూ.56కోట్ల వరకు జరిమానాలు విధించి అధికారులు చేతులు దులుపుకున్నారు. దీనిపై జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) లక్ష్మీనారాయణను 'ఈనాడు' సంప్రదించగా క్షేత్రస్థాయికి అధికారులను పంపించి విచారణ చేయిస్తామని తెలిపారు.

రంగనాథుడి సన్నిధిలో ఐజీ



ఆలయ శాసనం చదువుతున్న ఐజీ రమేశ్‌రెడ్డి

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : శ్రీరంగాపురంలోని రంగనాథాలయాన్ని పోలీసుశాఖ ఐజీ రమేశ్‌రెడ్డి కుటుంబసభ్యులతో శనివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వారికి అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక అర్చన జరిపించి, స్వామివారి శేష వస్త్రాన్ని అందించి ఆశీర్వదించారు. అనంతరం ఆలయంలోని తంజావూర్ చిత్రపటాలను, స్వామివారి వెండి వాహనాలను వారు సందర్శించారు. స్థానిక ఏఎస్సైలు రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.



అలుగు నీటిలో దాటేదెలా?

గోపాల్‌పేట మండలం తాడిపర్తి నుంచి మున్ననూరు గ్రామానికి వెళ్లే రహదారిపై తాడిపర్తి చింతలయ్యకుంట నుంచి అలుగు నీరు పారుతోంది. నీరు రోడ్డుపైనే నిలుస్తోంది. రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. నీరు సాఫీగా వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తాడిపర్తి, మున్ననూరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, వనపర్తి వ్యవసాయం

ఇక మెరుగైన పౌష్టికాహారం

- 312 ప్రభుత్వ పాఠశాలల్లో మంచి భోజనం
- సీఎం నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు

న్యూస్‌టుడే, కోస్గి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే కాకుండా, విద్యార్థులకు మరింత మెరుగైన పౌష్టికాహారాన్ని అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. చాలా పాఠశాలల్లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించడంలేదనే విమర్శలు ప్రస్తుతం ఉన్నాయి. ఈ క్రమంలో విద్యార్థులకు ఒకేచోట నాణ్యమైన భోజనాన్ని తయారుచేసి అన్ని పాఠశాలలకు అందించాలని, దీంతో విద్యార్థులందరికీ బలవర్ధకమైన పౌష్టికాహారం అందుతుందని భావించారు. పైలెట్ ప్రాజెక్టుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌ని ఎంపిక చేశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించనున్నారు. ఇందుకోసం అక్షయ పాత్ర సంస్థ బాహుబలి వంటషెడ్‌ను కొడంగల్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెలాఖరుకు దీని నిర్మాణం పూర్తిచేసి, విద్యార్థులకు భోజనం అందించాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నారు. వంటగది నిర్మాణానికి రూ.4 కోట్లు వెచ్చించనున్నారు. హరేరామ హరే కృష్ణ ఫౌండేషన్ రూ.2 కోట్లు, సీఎస్ఆర్ ఫౌండేషన్ రూ.2 కోట్లు వెచ్చిస్తోంది. ఇప్పటికే నిర్మాణం ఒక కొలిక్కి వచ్చింది. కొంతమేర సామగ్రి సైతం చేరుకుంది. పనులను వేగంగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని అధికారులు యోచిస్తున్నారు.





కొడంగల్‌లో నిర్మిస్తున్న భారీ వంటశాల

- కొడంగల్ నియోజకవర్గం పరిధిలో నారాయణపేట జిల్లాలోని కోస్గి, మద్దూరు, గుండుమాల్, కొత్తపల్లి మండలాలు, వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాలు ఉన్నాయి. మొత్తం 312 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కొడంగల్ నుంచి మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం అందించనున్నారు. 28 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. ఈ నెలాఖరు నుంచి కొత్త మెనూప్రకారం భోజనం అందిస్తామని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి 'న్యూస్‌టుడే'తో అన్నారు.

ప్రత్యేక బస్సుల పేరిట అదనపు రుసుం

కొత్తకోట, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సుల్లో రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆ శాఖ అధికారులు జేబులు ఖాళీ చేసే పనికి పూనుకున్నారని ప్రయాణికులు ఆరోపించారు. వనపర్తి డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులో కొత్తకోట నుంచి హైదరాబాద్‌కు అదనంగా రూ.100 వసూలు చేస్తుండగా ప్రయాణికులు కండక్టర్‌తో గొడవకు దిగి బస్సు నిలిపి వేశారు. ఛార్జీలు ఎక్కువ ఎందుకివ్వాలంటూ అతన్ని నిలదీశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు చెప్పడంతో ప్రయాణికులు బస్సును ముందుకు వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. అదే సమయంలో ఇతర డిపో బస్సులు వెళ్తుండగా వాటిని ఆపి హైదరాబాద్ ఛార్జీ వివరాలు తెలుసుకున్నారు. మామూలు ఛార్జీ తీసుకుంటున్నట్లు సంబంధిత కండక్టర్లు చెప్పడంతో గొడవ మరింతగా పెరిగింది. సమాచారంతో పోలీసులు చేరుకుని బస్సు వెళ్లనివ్వాలని, లేదంటే స్టేషన్‌కు రావాలని హెచ్చరించడంతో వివాదానికి తెర పడింది. ఛార్జీల పెంపుపై డీఎం వేణుగోపాల్‌ను వివరణ కోరగా ప్రయాణికుల రద్దీకి అనుకూలంగా హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడిపిస్తూ అందులో మాత్రమే 50 శాతం అదనపు ఛార్జీ విధించినట్లు పేర్కొన్నారు.

ఇళ్లపై యమపాశాలు!

పురపాలికల్లోని పలు కాలనీల్లో విద్యుత్తు లైన్లు ప్రమాదకరంగా వెళ్లాయి. ఇళ్లపై నుంచి చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. వాటితో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. భారీ ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి విద్యుత్తు వైర్లను తొలగించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఈనాడు పరిశీలన

ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని..

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : పట్టణంలోని ఎనిమిదో వార్డులో ఇళ్లపై నుంచి హైటెన్షన్ విద్యుత్తు తీగలు వెళ్లాయి. గాలులకు తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పులు పడుతున్నాయని, ఇంటి ముందు కూర్చోవాలంటే భయంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై విద్యుత్తు శాఖ ఇన్‌ఛార్జి ఏఈ నరసింహను వివరణ కోరగా నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామన్నారు.



ఎనిమిదో వార్డులో హైటెన్షన్ విద్యుత్తు తీగలు

నితంయ భయం


వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : పట్టణంలోని గాంధీనగర్, పాతకోట, మారెమ్మ కుంట, రాంనగర్‌కాలనీ, బసవన్నగడ్డ తదితర కాలనీల్లో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇళ్లపైకి వెళ్లాలంటే తీగలు తగిలి ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' టీజీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ రాజశేఖరంను వివరణ కోరగా.. ఇళ్లపై నుంచి వెళ్లిన విద్యుత్తు లైన్ల వివరాలు సేకరించామని తెలిపారు. నిధుల మంజూరుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. మంజూరు కాగానే తొలగించి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు.



వనపర్తి పట్టణం గాంధీనగర్‌లో


తరచూ ప్రమాదాలు..

అమరచింత, న్యూస్‌టుడే : కొత్తగా వెలుస్తున్న కాలనీల్లో 33.11 కేవీ విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా నిలిచాయి. బీసీ కాలనీలో ఇంటి నిర్మాణ సమయంలో, ఇంటి పైన దుస్తులు ఆరవేయడానికి వెళ్లి విద్యుదాఘాతానికి గురైన వారు ఉన్నారు. శ్రీకృష్ణనగర్‌లో తీగలు రహదారి పక్కన ఉండటంతో చెరకు ట్రాక్టర్లు, ధాన్యం బస్తాలు తీసుకెళ్తుండగా తీగలు తగిలి ఆస్తి నష్టం జరిగింది. పుర కమిషనర్ నూరుల్ నజీబ్‌ను వివరణ కోరగా లైన్ మార్చాలంటే విద్యుత్తు శాఖకు డీడీ కట్టాలని ఇందుకు కావాల్సిన డబ్బులు ఎమ్మెల్యే, ఎంపీ నిధుల నుంచి సమకూర్చుకోవాలని పాలకవర్గం తీర్మానం చేసిందన్నారు.



అమరచింత బీసీ కాలనీలో..

పది మొక్కల లక్ష్యం.. ఇచ్చింది ఫలితం



ధరూరు ఉన్నత పాఠశాల ఆవరణలో పచ్చదనం

ఏపుగా పెరిగిన మొక్కలు

ధరూరు, న్యూస్‌టుడే: ఇంట్లో నుంచి బయటకు వెళ్తే తిరిగి ఇంటికి వచ్చే లోపు కరోనా మహమ్మారి ఎక్కడ కబళిస్తుందోనన్న భయంతో బతుకుతున్న రోజులు.. ధరూరు పాఠశాల ఉపాధ్యాయులదీ అదే పరిస్థితి. రోజూ 1,150 మంది విద్యార్థుల మధ్య తిరుగుతూ నిత్యం కళకళలాడే పాఠశాల బోసిపోయిన తీరు. ఆ సమయంలో ఏదో తెలియని ఉపాధ్యాయులకు ఓ చక్కటి ఆలోచన వచ్చింది. ప్రధానోపాధ్యాయులకి వివరించి ఆయన నిర్ణయంతో అడుగు ముందుకేశారు. గ్రామ మాజీ సర్పంచి సహకారంతో పాఠశాలలో మొక్కలు నాటి వాటి సంరక్షణ చర్యలకు శ్రీకారం చుట్టారు. ఉపాధ్యాయులే తలా ఇంత పోగేసి దాతల సహకారంతో రూ.లక్ష వరకు వెచ్చించి కడియం నర్సరీ నుంచి ప్రత్యేకంగా మొక్కలు తెప్పించారు. తలా పది మొక్కలు దత్తత తీసుకొని కరోనా అంతరించి పోయి పాఠశాలలు తెరిచే దాకా సంరక్షిస్తూ నీరందించారు. ఎవరికి వారు తాము దత్తత తీసుకున్న పదిమొక్కల పెంపకం పూర్తి బాధ్యతలు ఇప్పటికీ నిర్వర్తిస్తూ వస్తున్నారు. రెండేళ్ల గడిచే సరికి పాఠశాల పచ్చదనపు కళతోపాటు చల్లదనాన్ని, స్వచ్ఛమైన గాలిని ఇస్తోంది. చెట్లను చూస్తే తృప్తిగా అనిపిస్తుందని ఉపాధ్యాయులంటున్నారు.

వైభవం..జోగులాంబ తెప్పోత్సవం!



హంస వాహనంపై జలవిహారం



అలంకరణలో ఉత్సవమూర్తులు



నదిహారతులు ఇస్తున్న అర్చక స్వాములు

అలంపూర్, న్యూస్‌టుడే: శక్తి పీఠంలో దసరా ఉత్సవాలు విజయ దశమితో ముగిశాయి. ముగింపు సందర్భంగా శనివారం తుంగభద్ర నదిలో తీర్థవలి నిర్వహించారు. దేవతమూర్తుల విగ్రహాలతో పాటుగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. రాత్రి హంస వాహనంపై తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవతామూర్తులు ఆహ్లాదకరమైన వాతావరణంలో నదిలో విహరించారు. తిలకించేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలి రావడంతో పుష్కర్‌ఘాట్ కిక్కిరిసిపోయింది. ఉత్సవం సందర్భంగా నదీ హారతి ఇచ్చారు. కలెక్టర్ సంతోష్ దంపతులు, ఎమ్మెల్యే విజయుడు, ఈవో పురేందర్, ఆలయ ఛైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. పూర్ణాహుతి కార్యక్రమంతో ఉత్సవాలను ముగించారు. 108 రకాల సుగంధ ద్రవ్యాలు, వన మూలికలు, పట్టువస్త్రాలు ఆహుతి ఇచ్చారు. ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు. హంసవాహనంలోకి కేవలం కలెక్టర్ దంపతులు, ఎమ్మెల్యే, ఆలయ ఛైర్మన్‌కు మాత్రమే అవకాశం కల్పించారు. ధర్మకర్త సభ్యులు వెళ్తుండటంతో పోలీసులు అడ్డుకున్నారు. తమకే అవకాశం కల్పించకపోతే ఎలా అంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు.



భక్తజనంతో కిక్కిరిసిన పుష్కర్‌ఘాట్



మూర్తులకు పుణ్యస్నానాలు



ఆలయంలో భక్త జనసందోహం

ప్రభుత్వ గోదాముల్లోనే ధాన్యం నిల్వ!

ధరూరు, మల్దకల్, న్యూస్‌టుడే: రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలించటం వాటిని కస్టం మిల్లింగ్ చేసిన తర్వాత తిరిగి ప్రభుత్వానికి అప్పగించటంలో అనేక లోపాలు, అక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక మీదట రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం నేరుగా ప్రభుత్వ గోదాములకు తరలించి నిల్వ చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ చేసిన ప్రతిపాదనలకు వ్యవసాయ శాఖ ఆమోదం తెలిపింది. త్వరలోనే దీనికి సంబంధించి ఉత్తర్వులు వెలువడనున్నట్లు తెలిసింది.



కుర్విహాల్ చెర్వు వద్ద నిర్మించిన 5 వేల మెట్రిక్ టన్నుల ప్రభుత్వ గోదాం

గతంలో ఇలా

వరి ధాన్యం నేరుగా మిల్లులకే కేటాయించి కస్టమ్ మిల్లింగ్ ద్వారా తిరిగి వారి నుంచి బియ్యంను తీసుకొనేవారు. ఈ విధానంలో మిల్లర్లు పలు విధాలుగా ప్రభుత్వం ముందుంచటంతో పాటు మార్గదర్శకాల్లో మార్పులు చేయాలని పట్టుబట్టేవారు. దీంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రభుత్వ నిర్ణయం వెనక మరో అంశం కూడా ఉన్నట్లు సమాచారం. గతంలో మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని మిల్లర్లు బహిరంగ మార్కెట్‌కు తరలించి అమ్ముకొని వాటి స్థానంలో పీడీఎస్ లేదా ఇతర చోట్ల నుంచి సేకరించిన బియ్యం ప్రభుత్వానికి ఇవ్వడం జరిగింది. కొన్ని మిల్లుల నిర్వాహకులు ధాన్యం నిల్వలను పక్కదారి పట్టించి బియ్యం ఇవ్వలేక [illegible] డ్డారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు, ఆస్తుల జప్తునకు కలెక్టర్లు చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే.

అవసరమున్న మేరకే మిల్లింగ్

కొనుగోలు చేసిన ధాన్యం వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో ఉన్న గోదాములు, స్టేట్ వేర్ హౌసింగ్ గోదాముల్లో నిల్వ చేయనున్నారు. అయితే ఇప్పటికే వాటిని ఇతరులకు లీజుకు ఇచ్చి ఉంటే వాటిని ఖాళీ చేయించి వరి ధాన్యం నిల్వకు ఉపయోగించనున్నారు. జిల్లాలు, మండలాల వారీగా వచ్చే ధాన్యాన్ని సమీపంలో వ్యవసాయ శాఖ గోదాములకు తరలించి నిల్వ చేస్తారు. రైస్ మిల్లర్లతో సమస్య పరిష్కారం అయిన తర్వాత వారికి కేటాయించే అవకాశం ఉంది. ధాన్యం మిల్లులకు కేటాయించుట్లో కూడా ఈసారి మార్పులు చోటుచేసుకోనున్నట్లు తెలిసింది. సంక్షేమ పథకాలకు అవసరం ఉన్న మేర మాత్రమే మిల్లింగ్ చేయించి మిగిలిన వరిధాన్యం బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు సమాచారం.



నేటికి మంచి రోజులు

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్న చోట మండలానికి 5వేల మెట్రిక్ టన్నులు, సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉన్నచోట 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములను నిర్మించారు. వాటిలో చాలా వరకు వినియోగంలోకి రాలేదు. గద్వాల, కేటీదొడ్డి మండలాల పరిధిలో 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాములు ఐదేళ్లుగా వృథాగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో అప్పట్లో 65 మండలాల పరిధిలో గోదాములు నిర్మించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ పరిధిలో ఉన్న గోదాముల్లో 4.50 లక్షల టన్నుల ధాన్యం నిల్వ ఉన్న గోదాములు అందుబాటులో ఉన్నాయి. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో మొత్తం 17 చోట్ల దాదాపు 8లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్న గోదాములున్నాయి. జోగులాంబ జిల్లాలోనే 8 మండలాల పరిధిలో 55 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాములున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16.25 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం దిగుబడి రానుందని అంచనా. దీనికి అనుగుణంగా నిల్వకు ఇటు వ్యవసాయ శాఖ అటు పౌరసరఫరాల శాఖ సంయుక్తంగా ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది.

తుంగభద్రలో భారీగా పెరుగుతున్న ప్రవాహం



ఆర్డీఎస్ వద్ద తుంగభద్ర పరవళ్లు

శాంతినగర్, న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో ఆదివారం ప్రవాహం భారీగా పెరిగింది. జలాశయం ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు పడుతుండటంతో దాని నుంచి 80 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. జలాశయం దిగువన నదీపరివాహక ప్రాంతాల్లో పడుతున్న వర్షాలకు మరో 17,880 క్యూసెక్కులు, మొత్తం 97,880 క్యూసెక్కుల ప్రవాహం ఆర్డీఎస్ ఆనకట్టకు వద్ద ఉంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆనకట్ట వద్ద 12.8 అడుగుల ఎత్తులో నీటిప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 8.5 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, రాష్ట్రానికి వచ్చేసరికి అది 5.2 అడుగులుగా ఉంది.

మాంసం ముక్క గొంతులో ఇరుక్కొని రైతు మృతి



కాకి వెంకటన్న

మదనాపురం, న్యూస్‌టుడే : మాంసం ముక్క గొంతులో ఇరుక్కుని శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడి ఓ రైతు మృతి చెందారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం కొన్నూరు గ్రామానికి చెందిన రైతు కాకి వెంకటన్న (52) దసరా కనుమ పండగ సందర్భంగా ఆదివారం ఉదయం ఇంటికి మాంసం తెచ్చుకున్నారు. 10 గంటల సమయంలో అన్నం తింటుండగా మాంసం ముక్క గొంతులో ఇరుక్కుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స కోసం కొత్తకోటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.


కాల్వలోకి వాహనం దూసుకెళ్లి ఒకరు..



మహమ్మద్ బేగం

కందనూలు, న్యూస్‌టుడే : పత్తి తీయడానికి కూలీ పనులకు వెళ్తూ ఒకరు దుర్మరణం చెందగా మరో 12 మందికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... నాగర్‌కర్నూల్ మండలంలోని మంతటికి చెందిన 13 మంది కూలీలు అదే గ్రామ శివారులోని సర్వసతీ ఆలయ సమీపంలోని ఓ రైతు పొలంలో పత్తితీతకు వాహనంలో బయలుదేరారు. ప్రధాన రహదారి నుంచి పొలంలోకి వెళ్తుండగా వాహనం అదుపు తప్పి పక్కనే ఉన్న కేఎల్ఐ కాలువలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న మహమ్మద్ బేగం (45) అక్కడికక్కడే మృతి చెందగా మరో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగ్రాతులను 108 వాహనంలో పట్టణంలోని జనరల్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ప్రమాదంలో మృతి చెందిన మహిళ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తామని పేర్కొన్నారు. మహమ్మద్ బేగం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు..



జానకి రాములు

లింగాల, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం పద్మన్నపల్లిలో శనివారం రాత్రి చోటు చేసుకోంది. బంధువుల కథనం ప్రకారం.. రైతు పులిపాటి జానకి రాములు (60) శనివారం రాత్రి మొక్కజొన్న పంట కాపలా కోసం వెళ్తుండగా ప్రమాదవశాత్తు వ్యవసాయ బోరు తీగ కాలుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా విద్యుదాఘాతానికి గురై జానకిరాములు మృతి చెందినట్లు గుర్తించారు. భార్య, మగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

చెక్‌డ్యాంలో పడి బాలుడు..

తాడూరు, న్యూస్‌టుడే : తాడూరు శివారు కొమ్ముగుట్ట సమీపంలోని చెక్‌డ్యాంలో ఆదివారం మధ్యాహ్నం బర్రెలను నీళ్లు తాగించేందుకు వెళ్లిన 11ఏళ్ల ఓ బాలుడు ప్రమాదవశాత్తు నీటిలోపడి మునిగిపోయాడు. గమనించిన చుట్టు పక్క రైతులు అక్కడి చేరుకొని నీటిలో నుంచి బయటికి తీయగా బాలుడు అప్పటికే మృతి చెందాడు.

వేడి నూనెలో పడి చిన్నారికి తీవ్ర గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దినేశ్

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే: వేడి నూనెలో పడిన తొమ్మిదేళ్ల బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన వెల్దండ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దసరా పండుగ సందర్భంగా శనివారం ఉదయం వెల్దండలోని పాండు ఇంట్లో పిండి వంటలు చేశారు. భార్య పావని బాండీలో నూనెను అలాగే ఉంచారు. కుమారుడు చిన్నారి దినేష్ ఆడుకుంటూ అటుగా వచ్చి తగలడంతో బాండీలోని నూనెంతా కింద ఒలికింది. అందులోనే బాలుడు జారి పడటంతో ఒళ్లంగా తీవ్రంగా కాలింది. కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

దంపతుల మరణానికి కారణమైన వ్యక్తిపై కేసు

రేవల్లి(గోపాల్‌పేట), న్యూస్‌టుడే : వేరుసెనగ పైరును అడవి జంతువుల నుంచి కాపాడుకునేందుకు పొలం చుట్టూ విద్యుత్తు కంచె ఏర్పాటు చేసి ఇద్దరు వ్యక్తుల ప్రాణాలు పోవడానికి కారణమైన శానాయిపల్లి గ్రామానికి చెందిన బుడ్డ బాలయ్యపై కేసునమోదు చేశామని రేవల్లి ఎస్సై రాము తెలిపారు. రేవల్లి మండలంలోని కొత్తబండరావిపాకుల గ్రామానికి చెందిన బక్కన్న, నారమ్మ దంపతులు ఈనెల 11వ తేదీన సాయంత్రం సీతాఫలాలు తెంచుకుని రావడానికి శానాయిపల్లి గుట్టపైకి వెళ్లి తిరిగి వస్తుండగా గ్రామ శివారులో వేరుసెనగ పైరుకు రక్షణగా పెట్టిన విద్యుత్తు కంచె తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. శానాయిపల్లి, కొత్తబండరావిపాకుల గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పాన్‌గల్ ఎస్సై శ్రీనివాసులు, రేవల్లి ఎస్సై రాము సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. మృతుల కుమారుడు కాశీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శనివారం మృత దేహాలకు రేవల్లి ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించినట్లు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	126–00
రిటైల్	148–00
డ్రెస్డ్	215–00
స్కిన్‌లెస్	244–00

జాతీయ స్థాయి టార్గెట్‌బాల్ పోటీలకు ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : జాతీయస్థాయి అండర్-19 టార్గెట్‌బాల్ టోర్నీలో పాల్గొనే తెలంగాణ బాల,బాలికల జట్లకు ఉమ్మడి జిల్లా నుంచి ఆరుగురు ఎంపికయ్యారు. నవాబుపేట మండలం సిద్దోటంకు చెందిన ఎస్.కృష్ణ, కోయిలకొండ మల్కాపూర్‌కు చెందిన కె.నవీన్, కోయిలకొండ మండలం పారుపల్లిలోని శ్వేత విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సుమిత్ర, నాగలక్ష్మి, కేదారేశ్వరి, పి.రాంచరణ్‌లు బాల,బాలికల జట్లకు ఎంపికయ్యారు. జూనియర్స్ టోర్నీ బిహార్‌లోని రాంసహాయ్ ఛాప్రాలో ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. క్రీడాకారులను టార్గెట్‌బాల్ సంఘం సభ్యులు ఉమామహేశ్, శీనయ్య తెలిపారు.

500 మిలియన్ యూనిట్లకు చేరిన విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల జలాశయం వద్ద వరద ఉద్ధృతి కొనసాగుతున్న క్రమంలో ప్రస్తుత వర్షాకాలం ఎగువ, దిగువ కేంద్రాల్లో ఉత్పత్తి 500.600 మిలియన్ యూనిట్లకు చేరింది. ప్రాజెక్టుకు 42 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా విద్యుదుత్పత్తికి 37,267 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గత 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 3.143, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 3.493 మిలియన్ యూనిట్ల మేరకు ఉత్పత్తి జరిగింది. ప్రస్తుత సీజన్‌లో ఎగువన 261.142, దిగువన 239.458 మిలియన్ యూనిట్లకు ఉత్పత్తి చేరిందని ఎస్ఈ జెన్‌కో (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

సమాజహితాన్ని కోరిన సాయిబాబా

పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి



మహబూబ్‌నగర్: తెలంగాణ కూడలిలో సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎం.రాఘవాచారి, తదితరులు

పాలమూరు, న్యూస్‌టుడే: సమాజ మార్పుకై, భవిష్యత్తు తరాల కోసం జీవితాన్ని అంకితం చేసిన ఘనత ఆచార్య సాయిబాబాకే దక్కిందని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి అన్నారు. ఈ మేరకు ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం తెలంగాణ కూడలిలో సాయిబాబా సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గత 15 రోజుల నుంచి తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 12వ తేదీ రాత్రి చనిపోయారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పదేళ్ల నుంచి ఆయనపై అక్రమ కేసులు పెట్టి హింసకు గురి చేసిందని విమర్శించారు. సాయిబాబా 9 ఏళ్ల పాటు ఒంటరిగా జైల్ జీవితం అనుభవించారని చెప్పారు. కారాగారంలో సరైన చికిత్స అందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. జైలు శిక్షలో ఉండగానే మహారాష్ట్ర హైకోర్టు సాయిబాబాను నిర్దోషిగా ప్రకటించిందన్నారు. టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ఖలీల్, డీటీఎఫ్ నాయకులు ఆదిత్య, వెంకటేశ్వర్లు, నాగభూషణం, వామన్‌కుమార్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు మన్నెం కొండ, పాలమూరు అధ్యయన వేదిక నాయకులు తిమ్మప్ప, కేసీ వెంకటేశ్వర్లు, ఉదయమిత్ర తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబీకుల ఆందోళన



బాలానగర్: రోడ్డుపై ధర్నా చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

బాలానగర్, న్యూస్‌టుడే: మండలంలోని మొదంపల్లి గ్రామానికి చెందిన స్వామి(25) శుక్రవారం రాత్రి టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన విషయం విదితమే.. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలంటూ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై శనివారం ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో 2 గంటలకు పైగా ట్రాఫిక్ జామ్ నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్పందించిన సీఐ నాగార్జున గౌడ్, ఎస్సై తిరుపాజీ టిప్పర్ డ్రైవర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ మంజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపాజీ తెలిపారు.

నాటు వైద్యం వికటించిన ఘటనలో ఇద్దరిపై కేసు

మహబూబ్‌నగర్ నేరవిభాగం: నాటు వైద్యంతో వ్యాధిని నయం చెద్దామనుకున్న వారికి అది వికటించడంతో ఇరువురిపై కేసు నమోదైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామీణ ఠాణా ఎస్సై విజయ్‌కుమార్ వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ రాజకీయ నాయకుడు కొన్నేళ్ల నుంచి పక్షవాతంతో బాధ పడుతున్నారు. వ్యాధి పూర్తిగా నయం చేస్తామని బాధితుడికి తెలిసిన వ్యక్తి భరోసా కల్పించాడు. దీంతో అతను మరో నాటు వైద్యుడిని తీసుకొచ్చి గత నెల 21వ తేదీన ఇంట్లోనే చికిత్స చేశారు. కాళ్ల నుంచి శరీరమంతా చపాతీల కర్రతో కొట్టి అనంతరం శరీరంపై నాటు మందు వేశారు. దీంతో మరుసటి రోజు ఉదయం శరీరంపై దద్దులు వచ్చి పగలిపోయాయి. ఈ విషయమై నాటు వైద్యం చేసి వెళ్లిన వారికి సమాచారం అందించగా వారు రాలేదు. దీంతో గత నెల 30న బాధితుడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తెరపై ఈనాడు

శ్రీనివాస: **దేవర**, వెంకటేశ్వర: **మార్టిన్ (ఉదయం, సెకండ్‌షో), మా నాన్న సూపర్‌హీరో (మ్యాట్నీ, ఫస్ట్‌షో)**
శ్రీరామా: **వేట్టయన్** –న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

కమనీయం శ్రీవేంకటేశ్వరుడి కల్యాణం


పల్లకీసేవలో భక్తులు

కొత్తకోట, న్యూస్‌టుడే: పట్టణం సమీపంలోని శ్రీ వేంకటగిరి శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. స్వామి జన్మ నక్షత్రం శ్రవణ సందర్భంగా శ్రీలక్ష్మీ, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహించారు. కొత్తకోట, పాలెం, కానాయపల్లి, నిర్వెన్ తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు భక్తుల సహకారంతో నిర్వహించారు. వేడుకల్లో ఆలయ అర్చకులు సింగరాచార్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

రూ.40 వేలు పలికిన లడ్డూ

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని మైత్రి నగర్ చౌడేశ్వరీ ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత లడ్డూ ప్రసాదాన్ని కాలనీకి చెందిన పెద్దకోట సంతోష్ రూ.40 వేలకు దక్కించుకున్నారు. నిర్వాహకులు కాలనీవాసులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ఠాణాలో ఆయుధ పూజ

అమరచింత, న్యూస్‌టుడే : అమరచింతలో ఠాణాలో శనివారం ఎస్సై బి.సురేశ్ ఆయుధ పూజ చేశారు. దుర్గమ్మ చిత్రపటానికి పూజించి పోలీసు వాహనాలకు, ద్విచక్ర వాహనాలకు ముస్తాబు చేయించారు. కార్యక్రమంలో ఏఎస్సై జమీరుద్దీన్, హెడ్ కానిస్టేబుల్ వలీ, రాములు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి త్రిశూలం బహూకరణ


త్రిశూలాన్ని అందజేస్తున్న దంపతులు భవానీ, రషీద్

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : పట్టణంలోని శ్రీఅంబా భవాని శంకరాలయంలో కొలువుదీరిన అమ్మవారికి పట్టణానికి చెందిన దంపతులు భవానీ, రషీద్ రూ.2 లక్షలు విలువ చేసే రెండు కిలోల వెండితో చేసిన త్రిశూలాన్ని బహూకరించారు. అర్చకులు సదాశివుడు, ఆనంద్, కోటేశ్వర్ స్వాములకు అందజేశారు.

ఆత్మకూరు పుర కమిషనర్‌గా శశిధర్



ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు పురపాలిక కమిషనర్‌గా చికినే శశిధర్ విధుల్లో చేరారు. ఆత్మకూరు కమిషనర్ కొనసాగిన నాగరాజు కోస్గికి బదిలీ కాగా.. అక్కడి నుంచి శశిధర్ ఆత్మకూరుకు బదిలీ అయ్యారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్రం బోధనకు అతిథి అధ్యాపక నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ గోపాల్ తెలిపారు. ఆసక్తి ఉన్న అర్హులైన నిరుద్యోగ యువతీ, యువకులు సోమవారం సాయంత్రంలోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు ఈనెల 15న వనపర్తిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌఖిక పరీక్ష ఉంటుందన్నారు. మౌఖిక పరీక్షకు హాజరయ్యే వారు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు.

ఆది శిలాక్షేత్రం.. భక్తజన సందోహం

మల్దకల్, న్యూస్‌టుడే: విజయదశమి పర్వదినం శనివారం కలిసి రావడంతో మల్దకల్ ఆది శిలాక్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని ఉత్సాహంగా మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, గోపూజ, శాంతిహోమం, పంచామృతాభిషేకం, అలంకరణ, మంగళహారతి నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం, పల్లకీ సేవ, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, శమీవృక్షం పూజ, పవళింపు సేవను నిర్వహించారు. ఈసందర్భంగా గద్వాల సీఐ నాగేశ్వరరావు, తెదేపా మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థినులకు సన్మానం

పెబ్బేరు పట్టణం: పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన సోనీ, సౌమ్య ఎంబీబీఎస్ సీటు సాధించడంతో ఆదివారం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అక్కమ్మ, మాజీ వార్డ్ సభ్యుడు రాములు, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : శ్రీరంగాపురానికి చెందిన వెంకటేశ్, రేణుక దంపతుల కుమార్తె వర్షిత ఎంబీబీఎస్‌లో సీటు దక్కడంతో అంబేడ్కర్ కమిటీ సభ్యులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ఎస్సీ ఫెడరేషన్ సభ్యులు, కాలనీ ఉద్యోగులు పాల్గొన్నారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చేశా

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకుని శక్తికి మించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని మాజీమంత్రి నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని నివాసంలో ఆయన జన్మదినం సందర్భంగా రూపొందించిన భాగ్యనగర్ పోస్టు ప్రత్యేక సంచిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజా రామేశ్వర్ రావు వనపర్తి రాజు అయినప్పటికీ ఎక్కడ తన విగ్రహాలు పెట్టొద్దని వీలునామాలో ప్రస్తావించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో భాగ్యనగర్ పోస్ట్ ఎడిటర్ రాఘవరెడ్డి, కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి, కిరణ్‌కుమార్, కవి వనపట్ల సుబ్బయ్య, భారాస జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్‌పోటీల విజేత లిటిల్‌స్టార్ జట్టు


బహుమతి దక్కించుకున్న గోపాల్‌పేట లిటిల్‌స్టార్ క్రికెట్ జట్టు

గోపాల్‌పేట: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని గోపాల్‌పేటలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో స్థానిక లిటిల్‌స్టార్ జట్టు విజేతగా నిలిచింది. గోపాల్‌పేటకు చెందిన ఎర్రగట్టుతండా జట్టుకు రన్నరప్‌గా, 11 వారియర్స్ జట్టుకు మూడో బహుమతి దక్కింది. విజేత జట్లకు నగదు బహుమతులతో పాటుగా జ్ఞాపికలను అందజేశారు. బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో శ్రీనివాసులు, బాలరాజు, ఆరీఫ్, భాస్కర్, శేఖర్, రాజేశ్‌గౌడ్, మతీన్, ప్రభాకర్, కాశీం పాల్గొన్నారు.


బేతాళుడిని పల్లకీలో మోస్తున్న హైదరాబాద్ సీఐ యాదేందర్



పూజలో ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, వనపర్తి సంస్థానాధీశుల వారసుడు రాజాకృష్ణదేవరావు, భక్తులు


వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు

ఊరూరా.. దసరా


పెబ్బేరులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

న్యూస్‌టుడే, బృందం: జిల్లాలో దసరా పండగను ఘనంగా జరుపుకొన్నారు. శనివారం ఉదయం నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం జమ్మిచెట్టు వద్దకు వెళ్లి పూజలు నిర్వహించారు. ఒకరినొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. శ్రీరంగాపురంలోని రంగనాథాలయం భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం అశ్వ వాహనంపై రంగనాథుడిని తిరువీధుల్లో ఊరేగించారు. వనపర్తి సంస్థానాధీశుల కాలం నుంచి ఆనవాయితీ ప్రకారం రాజప్రాసాదంలోని ఆలయంలో తొమ్మిదిరోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. పదో రోజు శివపార్వతుల విగ్రహ రథాన్ని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, సంస్థానాధీశుల వారసుడు రాజాకృష్ణదేవరావు, ఆరుద్రరావు ఊరేగింపులో పాల్గొన్నారు. కొత్తకోట కోదండ రామాలయంలో పూజల అనంతరం శమీపూజ క్షేత్రం వరకు సీతారాముల పల్లకి సేవ కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు స్వామి వివేకానంద విగ్రహం వద్ద వీహెచ్‌పీ ఆధ్వర్యంలో కాషాయ ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. పాన్‌గల్ మండలం కేతేపల్లిలో ఉమ్మడి జిల్లా డీసీసీబీ ఛైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు.


ఖిల్లాగణపురంలో రావణాసురుడి దిష్టి బొమ్మ దహనం


ఆత్మకూరులో రావణుడి దిష్టిబొమ్మ దహనం


అమరచింత : భాజపా జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి మంత్రి శ్రీనివాసులుతో భాజపా నాయకులు


అశ్వవాహనంపై రంగనాథుడు


అమరచింతలో ప్రదర్శనగా వెళ్తూ..


కేతేపల్లిలో పూజ చేస్తున్న డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు


కొత్తకోటలో కోదండరాముడి పల్లకీసేవ


ఆత్మకూరులో దశమికట్ట వద్ద పూజలు



వనపర్తి : అచ్యుతాపురంలో జమ్మి చెట్టుకు పూజలు


కొత్తకోట : పామాపురంలో బతుకమ్మలను తీసుకెళ్తున్న మహిళలు


వనపర్తి నిమజ్జనానికి తరలిన పెద్దమ్మగుడి దుర్గమ్మ..


ఆత్మకూరు విగ్రహం ఊరేగింపు..


ఆత్మకూరులో పోతురాజుల విన్యాసం..


గాంధీచౌక్ దుర్గామాత

దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనం

న్యూస్‌టుడే, బృందం : నవరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి, భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వేడుకల సందర్భంగా పలుచోట్ల ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహాలను నిమజ్జనం చేశారు. మంగళవాయిద్యాలు, బాణాసంచా కాల్పుల మధ్య నృత్యాలు చేస్తూ మహిళలు, చిన్నారులు, యువకులు సందడి చేశారు. వనపర్తి హనుమాన్ టేకిడిలో ప్రతిష్ఠించిన దుర్గామాతను ఆదివారం మాజీమంత్రి నిరంజన్ రెడ్డి దర్శించుకున్నారు. శనివారం ఆయన రాజా కృష్ణదేవరావుతో భేటీ అయి వివిధ అంశాలపై చర్చించారు.


శ్రీరంగాపురం రాజులగట్టులో భక్తుల హోమం


మహిళలతో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి


ఆత్మకూరు కేశవనగర్‌లో..

పాఠశాల అభివృద్ధికి కృషి


జీహెచ్‌ఎం శంకర్ గౌడ్‌కు బంగారు నాణేలు అందజేస్తున్న ఎన్నారై శ్రీహరి రెడ్డి

పెబ్బేరు, న్యూస్‌టుడే : మండలంలోని యాపర్ల గ్రామ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని ఎన్నారై సూదిరెడ్డి శ్రీహరి రెడ్డి అన్నారు. శనివారం దసరా పండగ రోజు పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై పాఠశాల అభివృద్ధికి విడతల వారీగా రూ.10 లక్షలు విరాళం అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఇటీవల రూ.3లక్షలతో పాఠశాలకు రంగులు వేయించి గోడలపై దేశనాయకుల చిత్ర పటాలు వేయించి బోధనా అవసరాలకు సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థిగా పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్నట్లు చెప్పారు. ఏడు, పదో తరగతిలో ప్రతిభ కనబరచిన విద్యార్థుల కోసం బంగారు నాణేలను అందజేసే విధంగా ముందస్తుగానే పాఠశాల జీహెచ్‌ఎం శంకర్ గౌడ్‌కు అందజేశారు. ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు. గ్రామానికి చెందిన సత్యనారాయణ 12 మంది విద్యార్థులకు రూ.36 వేలతో రీడింగ్ కుర్చీలు, గ్రంథాలయం కోసం రూ.5 వేలు అందించారు. వినాయక యువజన సంఘం సభ్యులు పాఠశాలకు రూ.15 వేలు, యాదగిరి రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నరేందర్‌రెడ్డి, విక్రమ్‌గౌడ్, గోకారి, చిన్నమ్మ, స్వరాజ్యం బాబు రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిత్రునికి పూర్వవిద్యార్థుల చేయూత


ఖాజాహుస్సేన్‌కు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మదనాపురం, న్యూస్‌టుడే : కలిసి చదువుకున్న చిన్నప్పటి మిత్రుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు ఆర్థిక సాయం అందించి ఔదార్యం చాటుకున్నారు. మండలంలోని కొన్నూర్ గ్రామానికి చెందిన ఖాజా హుస్సేన్ ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందారు. విషయం తెలుసుకున్న మదనాపురం ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1995-96 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఖాజా హుస్సేన్‌కు రూ.72 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కరెంట్ ఆంజనేయులు, సాయియాదవ్, వెంకట్‌రెడ్డి, చంద్రయ్య, మహేశ్, పరుశరాముడు, రాంచంద్రయ్య, రాముడు, రాజు, రషీద్, తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకు ఢీకొని ఒకరి దుర్మరణం


భాస్కర్‌గౌడ్

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనంపై వెళ్తూ.. అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్న ప్రమాదంలో ఆదివారం ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని కంబాళాపురం సమీపంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు పాన్‌గల్‌కు చెందిన భాస్కర్‌గౌడ్ (51) స్వగ్రామం నుంచి పెబ్బేరులో ఉన్న బంధువులను కలిసేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కంబాళాపురం సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో, రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీ కొని కింద పడ్డారు. స్థానికుల సమాచారం మేరకు అత్యవసర వాహనంలో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఉదయ్‌కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని విలియంకొండ వద్ద శుక్రవారం రాత్రి రహదారి దాటుతున్న వనపర్తి మండలం మెంటపల్లికి చెందిన శ్రీనువాస్‌రెడ్డి, ఖాజా మైనోద్దీన్‌ను ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టిన విషయం తెలిసిందే. ప్రమాదంలో శ్రీనివాస్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన ఖాజామైనోద్దీన్ (45) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతానికి గురైన రైతు

అమరచింత, న్యూస్‌టుడే : మండలంలోని కొంకలవానిపల్లె గ్రామానికి చెందిన రైతు అంజన్న శనివారం రాత్రి వ్యవసాయ పొలం వద్ద విద్యుదాఘాతానికి గురయ్యారు. బోరు మోటారు వద్ద తీగలు సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. చేతికి రక్తగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు.

అదుపుతప్పి లారీ బోల్తా

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని పాలెం గ్రామం వద్ద వేగంగా వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. కర్నూలు నుంచి హైదరాబాద్‌కు టైర్లను తీసుకెళ్తున్న లారీ పాలెం వద్ద అదుపు తప్పి బోల్తా పడటంతో డ్రైవర్ రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని ఆస్పత్రికి తరలించారు.

లక్కీ డ్రా పేరిట మోసం.. కేసు నమోదు

చిన్నంబావి, న్యూస్‌టుడే: లక్కీ డ్రా స్కీం పేరిట ప్రజలను మోసం చేసిన ఐదుగురిని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై రమేశ్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఒక్కో వ్యక్తి నుంచి పదహారు నెలల పాటు నెలకు రూ.వెయ్యి చొప్పున వసూలు చేసి, ఎలాంటి బహుమతులు ఇవ్వలేదని పేర్కొన్నారు. రూ.యాభై లక్షలకు పైగా మోసం జరిగినట్లు బాధితులు తెలిపారని, దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్సై తెలిపారు.

విజయదశమి వేడుకల్లో ఘర్షణ

అమరచింత, న్యూస్‌టుడే : మండలంలోని మిట్టనందిమల్ల గ్రామంలో శనివారం రాత్రి విజయదశమి సందర్భంగా నిర్వహించిన వేడకల్లో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు గాయపడ్డారు. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామంలో రెండేళ్ల నుంచి దుర్గమ్మ ప్రతిమను ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి అమ్మవారి విగ్రహం ఊరేగింపు సందర్భంగా ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గ్రామానికి చెందిన అనంతయ్యకు గాయాలయ్యాయి.